క్లుప్తంగా

ఎంపీని కలిసిన ఎమ్మెల్సీ సిపాయి



తిరుపతి తుడా: వైఎస్సార్ సీపీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం బుధవారం తిరుపతి ఎంపీ గురుమూర్తిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీగా ఎన్నికవ్వడానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సత్కరించారు.

శిల్పారామంలో ఘనంగా హోలీ సంబరాలు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో బుధవారం హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని మహిళలు, పిల్లలు, పురుషులు పెద్ద ఎత్తున పాల్గొని ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డీజే మ్యూజిక్, రెయిన్ డ్యాన్స్, తీన్మార్ బ్యాండ్ నడుమ యువత సంబరాలను జరుపుకున్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని బుధవారం ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్ రెడ్డి, వెంకటేగౌడ్, కర్ణాటక ఎమ్మెల్యే సతీష్, కన్నడ నటుడు దర్శన్ దర్శించుకున్నారు. వీరికి అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

శిరోముండనం కేసులో మరో ఇద్దరి అరెస్టు



నిందితులను అరెస్టు చేసి వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌ఐ వంశీధర్

చంద్రగిరి: మండలంలోని ఏ.రంగంపేటకు చెందిన వంశీపై దాడి చేసి శిరోముండనం చేసిన కేసులో మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు చంద్రగిరి ఎస్‌ఐ వంశీధర్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ వంశీపై దాడి చేసి, గుండు కొట్టించిన కేసులో హర్షవర్ధన్, అన్వర్‌కు సహకరించిన హేమంత్, వేణుగోపాల్ బుధవారం మధ్యాహ్నం తొండవాడ ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ వద్ద ఉండగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిని తిరుపతి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఇదే కేసులో మరో నిందితుడు మునివెంకటేశు పరారీలో ఉన్నాడని, అతన్ని కూడా త్వరలో పట్టుకుంటామని తెలిపారు. పీసీలు అన్వర్, బాష పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం



సమావేశంలో మాట్లాడుతున్న దివ్య

ఏర్పేడు: సేంద్రియ విధానంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయాన్ని సాధించవచ్చని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త దివ్య అన్నారు. పాపానాయుడుపేట రాస్ మహిళా భారతి కార్యాలయంలో బుధవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయంలో డ్రమ్‌సీడర్ విధానంతో తక్కువ ఖర్చు, కూలీలు, నీటి ఆదా చేసుకోవచ్చని సూచించారు. సేంద్రియ ఎరువుల వాడకంతో భూసారాన్ని పెంచుకోవచ్చన్నారు. భారతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో ఆధునిక పద్ధతుల్లో సాగుపై 25 రోజులు శిక్షణ జరుగుతుందన్నారు. పుట్టగొడుగులు, పెరటి కోళ్ల పెంపకం, సేంద్రియ విధానంలో కూరగాయల సాగుపై అవగాహన కల్పించారు. పంట మార్పిడి చేయాలన్నారు. రాస్ మహిళా భారతి ప్రాజెక్ట్ అధికారి బాలాజీరెడ్డి, పార్థసారథి, గిరిప్రసాద్ పాల్గొన్నారు.

మహిళా సమస్యలపై వెబ్‌సైట్

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరుకు చెందిన హేమవిజయ్ మహిళా దినోత్సవం సందర్భంగా www.weheardyou.in అనే వెబ్‌సైట్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చేతులమీదుగా ఆయన నివాసంలో ప్రారంభించారు. మహిళల భద్రత కోసం దీన్ని ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కులదూషణ, వరకట్న వేధింపులు, ఇతర కుటుంబ సమస్యలు ఈ వెబ్‌సైటు ద్వారా తెలియజేవచ్చని నిర్వాహకురాలు హేమవిజయ్ తెలిపారు. అందుకు సంబంధించి తీసుకోవలసిన చర్యలు, సలహాలను విశ్రాంత పోలీసులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తల ద్వారా బాధితులకు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో శైలప్రసాద్, శాంతి, పాల్, రుతూ, విక్టోరియా తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతితోనే దేశాభివృద్ధి

తిరుపతి ఎడ్యుకేషన్: మహిళాభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుందని, లింగ సమానత్వంతోనే భవిష్యత్తుకు పునాది అని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ సునీత తెలిపారు. పద్మావతి మహిళా వర్సిటీ మహిళా అధ్యయన కేంద్రం, విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారతలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. రిజిస్ట్రార్ రజని మాట్లాడుతూ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ రంగాల్లో మహిళల భాగస్వామ్యం మరింతగా పెరగాలన్నారు. తిరుపతి జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి జయలక్ష్మి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పాటు చేయడంలో మహిళలు ముఖ్య పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళా వర్సిటీ సోషల్ సైన్స్ డీన్ అనూరాధ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రొఫెసర్ సుజాత, మహిళా అధ్యయన కేంద్ర విభాగపు అధ్యాపకులు నీరజ, సంధ్యారాణి, మమత పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతతో లింగ సమానత్వం

ఆధునిక సాంకేతికత ద్వారానే లింగ సమానత్వం సాధ్యమవుతుందని ఎస్వీయూ మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ కె.సుధారాణి తెలిపారు. మహిళా అధ్యయన కేంద్రంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. లింగ వివక్ష రూపుమాపేందుకు సమాజంలో చైతన్యం తీసుకురావాల్సి ఉందన్నారు. ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ జి.పద్మనాభం, ప్రొఫెసర్లు డి.కృష్ణమూర్తి, డి.సాయి సుజాత, ఆర్‌బీ.సత్యవతి పాల్గొన్నారు.

ఇంటికి దీపం ఇల్లాలు

తిరుపతి ఎడ్యుకేషన్: ఇంటికి దీపం ఇల్లాలని శ్రీ పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ తులసి అన్నారు. ధనలక్ష్మీ నగర్‌లోని భాష్యం పాఠశాలలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి డాక్టర్ తులసి, క్రైమ్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ పూతలపట్టు సమతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ తులసి మాట్లాడుతూ ఒక మహిళ అమ్మగా, సోదరిగా, భార్యగా ఇంటిని, ఇంట్లోని పిల్లలకు మంచి సంస్కారం నేర్పాలని సూచించారు. మహిళా దినోత్సవం నిర్వహించాల్సిన బాధ్యతను వివరించారు. అనంతరం పాఠశాల నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల జోనల్ ఇన్‌చార్జి లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.

పలు పాఠశాలల్లో..

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం నగరంలోని పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఆయా రంగాల్లో రాణించిన మహిళల జీవిత చరిత్రను వివరించారు. మహిళలకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించారు.

సన్మానం..

తిరుపతి అర్బన్: మహిళాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని జిల్లా గ్రంథాలయ చైర్మన్ నైనార్ మధుబాల తెలిపారు. తిరుపతి గ్రేడ్ 1శాఖా గ్రంథాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ ఉద్యోగులు ధనుంజయులు, మునిరాజా, ఆర్ లలిత, మీనాకుమారి, రవీంద్రబాబు తదితరులు నైనార్ మధుబాలను సన్మానించారు.

లింగ సమానత్వంతోనే మహిళా సాధికారత

తిరుపతి తుడా: తిరుపతి ఎస్వీ వైద్య కళాశాల భువన విజయం ఆడిటోరియంలో బుధవారం ఏపీ ఎన్జీవోస్, రుయా హాస్పిటల్ నర్సింగ్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళ సాధికారతపై చర్చించారు. పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్. తిరుపతి ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షుడు ఎస్ సురేష్ బాబు పాల్గొన్నారు.



మహిళా దినోత్సవంలో

ఘనంగా మహిళా దినోత్సవం

తిరుపతి కల్చరల్: కరకంబాడి రోడ్డులోని కీర్తి న్యూరో అండ్ ఎమర్జెన్సీ హాస్పిటల్లో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. మహిళా సిబ్బంది రోగులకు పండ్లు, పూలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు ఏఎస్.కీర్తి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

తిరుపతి అర్బన్: సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా తిరుపతి ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో బుధవారం పలువురు మహిళా ఉద్యోగులను సన్మానించారు. పుత్తూరు డిపో మేనేజర్ ప్రశాంతి, పీవో పార్థసారధి, ఏటీఎం రామచంద్రనాయుడు, సత్యనారాయణ, అవుల ప్రభాకర్‌యాదవ్, బీఎస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళల హక్కులపై అవగాహన

తిరుపతి కల్చరల్: మహిళా దినోత్సవం సందర్భంగా బొజ్జాతారకం కాలనీలో బుధవారం యాక్షన్ ఎయిడ్ ఆధ్వర్యంలో తిరుపతి మండల లీగల్ సెల్ సర్వీస్ న్యాయవాది సుజాత మహిళల హక్కులపై అవగాహన కల్పించారు. హ్యూమన్ రైట్స్ డిఫెండర్ ఎం.నాగరాజ, న్యాయవాది శశాంక్, పారా లీగల్ వలంటీర్లు గిరిజ, నాగమణి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు స్వీట్లు పంపిణీ

తిరుపతి మంగళం: తిరుపతి 48వ డివిజన్‌లో పారిశుద్ధ్య కార్మికులకు ఆ డివిజన్ అధ్యక్షుడు తలారి రాజేంద్ర స్వీట్లు పంపిణీ చేశారు. తమ ఆరోగ్యాలను సైతం లెక్కచేయకుండా పారిశుద్ధ్యాన్ని మెరుగుపరుస్తున్న కార్మికుల సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో 49వ డివిజన్ అధ్యక్షుడు రెడ్డెప్ప, కార్మికులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం

తిరుపతి గాంధీ రోడ్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ నాయకుడు, రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళా పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన తొలినాళ్లలో మహిళలకు సమాన హక్కుల కోసం బీఆర్ అంబేద్కర్ పార్లమెంటులో బిల్లులను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఆయన కలలను నేడు ప్రధాని నరేంద్ర మోదీ అమలుచేస్తున్నారని తెలిపారు. పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మెడికో ఆస్పత్రిలో..

తిరుపతి కల్చరల్: తిరుపతి– కరకంబాడి రోడ్డులోని మేడికో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో బుధవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ నెల 8 నుంచి 11 వరకు మహిళలకు అన్ని విభాగాల్లో ఉచితంగా ఓపీ తీసుకుని వచ్చిన వారికి హెల్త్ ప్యాకేజీలో 20 శాతం రాయితీ ఇవ్వనున్నట్టు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, డాక్టర్ సజిత్ పేర్కొన్నారు.

స్త్రీలు మనోధైర్యంతో జీవించాలి

తిరుపతి కల్చరల్: మహిళలు మనోధైర్యంతో జీవించాలని సెట్విన్ సీఈవో వి.మురళీకృష్ణ, బాలాజీ నర్సింగ్ కళాశాల చైర్మన్ ప్రవీణ్, ఎస్వీయూ రిటైర్డ్ సూపరింటెండెంట్ భారతి పిలుపునిచ్చారు. బాలాజీ నర్సింగ్ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. చంద్రగిరి తహసీల్దార్ శిరీష, డ్వామా ఏపీడీ సీహెచ్.పద్మలత, దిశ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ ఆశా మాట్లాడారు. అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ చాటిన మహిళా ఉద్యోగులను సత్కరించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

మహిళలకే సీఎం అధిక ప్రాధాన్యం

తిరుపతి తుడా: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పేర్కొన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ప్రసూతి సెలవుల అంశాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.

పుట్టగొడుగుల పెంపకంపై వర్క్ షాప్

తిరుపతి అలిపిరి: తిరుపతి రీజినల్ సైన్స్ సెంటర్‌లో బుధవారం పుట్టగొడుగులు పెంపకంపై మహిళలకు వర్క్ షాప్ నిర్వహించారు. ఎస్వీ వ్యవసాయ కళాశాల ప్లాంట్ పేథాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ గురివిరెడ్డి, ప్రొఫెసర్ ప్రదీప్ మన్యం పుట్టగొడుగుల పెంపకం, మార్కెటింగ్ తదితరాలపై అవగాహన కల్పించారు. అంతకుముందు అలిపిరి నుంచి సైన్స్ సెంటర్ వరకు మహిళలతో ర్యాలీ నిర్వహించారు.

రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి పెద్దపీట

తిరుపతి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కొనియాడారు. మహర్షి అభ్యుదయ సేవా సంస్థ(మాస్) ఆధ్వర్యంలో బుధవారం గాంధీపురంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన మహిళలకు పురస్కారాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో 60 శాతానికిపైగా మహిళలకే సీట్లు కేటాయించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. జగనన్న స్ఫూర్తితోనే నియోజకవర్గంలో మహిళల అభ్యున్నతి కోసం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తున్నట్లు చెప్పారు. గాంధీపురం, ఓటేరు సర్పంచ్‌లు లక్ష్మీ సెల్వం, లక్ష్మీ, ఎస్‌ఐ సుమతి, మాస్ అధ్యక్షుడు జ్ఞానశేఖర్‌రెడ్డి, సెల్వం తదితరులు పాల్గొన్నారు.

మహిళలే మహరాణులు

తిరుపతి రూరల్: మహిళలే మహరాణులని తిరుపతి వెస్ట్ డీఎస్పీ నరసప్ప కొనియాడారు. ఎంఆర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో సీఐ సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళలకు నూతన వస్త్రాలను బహూకరించారు. ఎస్‌ఐ వినోద్ కుమార్, ఏఎస్‌ఐ చెంగయ్య, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

చంద్రగిరి: మహిళలు అన్నిరంగాల్లోనూ రాణించాలని డీఆర్‌డీఏ పీడీ జ్యోతి తెలిపారు. స్థానిక యూనియన్ బ్యాంక్ గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థ కార్యాలయంలో బుధవారం మహిళా దినోత్సవం జరుపుకున్నారు. వివిధ రంగాల్లో ఆదర్శంగా నిలిచిన మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు మేనేజర్ మహేష్, సంస్థ డైరెక్టర్ సురేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



మహిళా దినోత్సవంలో ఎస్వీయూ ప్రొఫెసర్లు



యూనియన్ బ్యాంక్ ఉపాధి శిక్షణ కార్యాలయంలో సంబరాలు జరుపుకుంటున్న అధికారులు



మహిళలకు పురస్కారాలు అందజేస్తున్న ఎంపీపీ మోహిత్‌రెడ్డి, మాస్ అధ్యక్షుడు జ్ఞానశేఖర్‌రెడ్డి



వస్త్రాలు అందజేస్తున్న డీఎస్పీ నరసప్ప, సీఐ సురేంద్రరెడ్డి



ర్యాలీ చేస్తున్న మహిళలు



మెడికో ఆస్పత్రిలో కేక్ కట్ చేస్తున్న యాజమాన్యం



మహిళా ఉద్యోగినిని సత్కరిస్తున్న నిర్వాహకులు



కేక్ కట్ చేసి మహిళా దినోత్సవం వేడుకలు జరుపుకుంటున్న కీర్తి న్యూరో డాక్టర్లు, సిబ్బంది



పారిశుద్ధ్య కార్మికులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న రాజేంద్ర





లిటిల్ ఏంజెల్స్‌లో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన, భాష్యం పాఠశాలలో మహిళా దినోత్సవం







పారిశుద్ధ్య కార్మికులను సత్కరించిన నాయకులు, గ్రంథాలయ చైర్మన్‌ను సన్మానిస్తున్న మహిళా ఉద్యోగులు, ఆర్టీసీ మహిళా ఉద్యోగులకు సన్మానం

పట్టాభినాయుడికి ఎమ్మెల్యే నివాళి



పట్టాభి నాయుడు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి

చంద్రగిరి: మండలంలోని అనంత గుర్రప్పగారిపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నేత మేడసాని పట్టాభినాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం కర్మక్రియలు నిర్వహించారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొని పట్టాభినాయుడు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుమారుడు మేడసాని దిలీప్, ఆయన సోదరుడు మేడసాని బాబ్జీ నాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, మస్తాన్, చంద్రమౌళిరెడ్డి, మేడసాని ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ





పెళ్లి కానుక అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాకాల: మండలంలోని చెన్నుగారిపల్లి పంచాయతీ మణిపిరెడ్డిపల్లి దళితవాడకు చెందిన నూతన వధూవరులకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెళ్లి కానుక పంపారు. వాటిని బుధవారం సర్పంచ్ కళావతి, మాజీ జెడ్పీటీసీ పవన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మయ్య, దొరస్వామిరెడ్డి, రవితేజరెడ్డి, కార్తీక్ అందజేశారు. వధూవరులు ఉదయ్‌కుమార్, లక్ష్మీప్రసన్న, అలాగే కళ్యాణ్‌కుమార్, మమతను ఆశీర్వదించారు.

ముగిసిన లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవం

శ్రీరంగరాజపురం: మండలంలోని మంగుంట లో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఎనిమిదో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 6 గంటలకు సుప్రభాతం, అభిషేకం, 9 గంటలకు యాగశాల, ప్రవేశ ఆరాధన, గణ పతి పూజ, మహా సంకల్పం, సంపూర్ణ పూర్ణహుతి, బలిహరణం, చక్రస్నానం నిర్వహించారు. దీంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. మధ్యాహ్నం అన్నదానం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు. ఉభయకర్తలు మల్లికార్జున రెడ్డి, సునీత, ఆలయ ధర్మకర్త ప్రసాద్ రెడ్డి, అర్చకులు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలే లక్ష్యం



మాట్లాడుతున్న జయకుమార్

తిరుపతి అర్బన్: వినియోగదారులకు మెరుగైన సేవలే లక్ష్యంగా పనిచేస్తున్నామని సప్తగిరి బ్యాంక్ రీజనల్ మేనేజర్ జయకుమార్ తెలిపారు. తిరుపతి ప్రకాశం రోడ్డులోని సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌లో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రుణ మేళా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళా ఖాతాదారులే తమ బ్యాంక్‌లో అధికంగా ఉన్నారని, రూ.100 కోట్ల వరకు రుణాలు ఇచ్చామన్నారు. బ్యాంక్ మేనేజర్ హేమ చంద్రయ్య, డీఆర్‌డీఏ పాల్గొన్నారు.

చట్టవ్యతిరేకంగా పోస్టులు పెడితే చర్యలు



స్టేషన్ వద్ద వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా నేతలు

చంద్రగిరి: చట్ట వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి అలజడి సృష్టించాలని చూస్తే చర్యలు తప్పవని చంద్రగిరి సీఐ ఓబులేశు హెచ్చరిచారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల సోషల్ మీడియాలో పెట్టిన పోస్టింగుల వల్ల ఏ.రంగంపేటకు చెందిన యువకుడిపై దాడి చేసి గుండు కొట్టించిన ఘటన సంచలనమైందని తెలిపారు. ఈ క్రమంలో మండలంలోని అన్ని రాజకీయ పార్టీల సోషల్ మీడియా వింగ్‌ల నాయకులకు కౌన్సెలింగ్ ఇస్తున్నట్టు తెలిపారు. వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా నాయకులు అంగేరి రాజశేఖర్, పఠాన్ రహీం, మట్టి రెడ్డి నవీన్‌ను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. వారు మాట్లాడుతూ టీడీపీ చేస్తున్న నిరాధార ఆరోపణలకు తాము ఆధారాలతో సహా పోస్టింగ్‌లు పెడుతున్నామని తెలిపారు. వారు పెట్టకపోతే తాము కూడా పెట్టమని మీడియాకు తెలిపారు.

భక్తుడికి నగదు అప్పగింత

చంద్రగిరి: స్వామివారి దర్శనం కోసం వచ్చి నగదు, పర్సు ఇతర వస్తువులను పోగొట్టుకున్న భక్తుడికి విజిలెన్స్ అధికారులు బుధవారం అప్పగించారు. హైదరాబాద్‌కు చెందిన జలగం వినోద్‌కుమార్ బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి కల్యాణ వెంకటేశ్వర స్వామి దర్శనం కోసం వచ్చారు. ఆలయంలో పర్సు పోగొట్టుకున్నాడు. అక్కడ విధులు నిర్వహిస్తున్న శ్రీవారి సేవకులు పర్సును గమనించి సూపరింటెండెంట్ చెంగ్రాయులు, జమేదారు చిరంజీవులుకు అందజేశారు. వారు ఆధార్, పాన్ కార్డు ఆధారంగా భక్తుడి వివరాలు తెలుసుకుని రప్పించి పర్సులోని రూ.3,200 నగదు పాన్ కార్డు, ఆధార్ కార్డులను టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి సమక్షంలో తిరిగి అప్పగించారు. భక్తుడు టీటీడీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



పోగొట్టుకున్న నగదు, పర్సును భక్తుడికి అప్పగిస్తున్న టీటీడీ అధికారులు

వైభవంగా రుద్రహోమం

తిరుపతి రూరల్: ముత్యాలరెడ్డిపల్లిలో నిర్మించిన గౌరీశంకర ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన, ప్రధాన దేవతల ఆవాహనం, అగ్ని ప్రతిష్ఠాపన, రుద్ర హోమం, దుర్గా హోమం, నవగ్రహ హోమం, సాయినాథ హోమం సకల పరివార దేవత హోమాలు, లఘు పూర్ణాహుతి, నైవేద్యం, నీరాజనం, మంత్ర పుష్పం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం భక్తులతో కలిసి గ్రామోత్సవం చేపట్టారు. జలధివాసం, క్షీరాధివాసం, స్నపన గణపతిపూజ, నిత్యవిధుల సోమనాథ పూజ, యాగియాగేశ్వరపూజ, యాగశాలార్చన నిర్వహించారు. రాత్రి పుష్పాధివాసం, ధనాధివాసం, శయ్యాధివాసం, చతుర్వేద స్వస్తి పారాయణ, దర్బారుసేవా, నీరాజనం చేశారు. ఆలయ ధర్మకర్త శ్రీరాములు పాల్గొన్నారు.



రుద్ర హోమం చేస్తున్న అర్చకులు

ఘనంగా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

తిరుపతి కల్చరల్: గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. సీనియర్స్ ఏబీ విభాగంలో విజేతలుగా జె.సాయిప్రసాద్, టి.గురుమూర్తి, రన్నర్స్‌గా సి.రంజిత్‌కుమార్, ఆర్‌సీ.రెడ్డి, బీ విభాగంలో విజేతలుగా ఎ.ఢిల్లీ, ఎం.చంద్రశేఖర్, రన్నర్స్‌గా ఎస్.రానేష్, ఆర్‌వీ.సతీష్ నిలిచారు. వారికి అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రెడ్డివారి ప్రభాకర్ రెడ్డి, కె.భాస్కర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. బహుమతులు వితరణ చేసిన చిల్లీస్ రెస్టారెంట్ అధినేత అంజి, సత్యభామ డెకార్స్ అధినేత రామమూర్తిరెడ్డి, అమ్మవారి పెయింట్స్ అధినేత జీఎం.సురేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కోశాధికారి పోతప్ప, శంకర్, గోపియాదవ్, అర్ముగం, కాటమరాజు, పేరూరు సుధాకర్‌రెడ్డి, ఎంఆర్.భారతి, విజయభాస్కర్‌రెడ్డి, హరిబాబు, సభ్యులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డి